www.vastavam.in
# వాస్తవం.ఇన్
డిజిటల్ పత్రిక
ఎడిటర్: దండుగుల శ్రీనివాస్
News you can trust
| సోమవారం | 14-07-2025 |

## రాష్ట్రంలో బీసీల రాజకీయ శకం ప్రారంభమైంది



- వచ్చేది బీసీల రాజ్యమే, ఇది ఇక ఎవరి ఆపలేరు
- బీసీ రిజర్వేషన్లపై దీర్ఘకాలికంగా పోరాటం చేస్తాం
- పార్టీలకతంగా బీసీలు ఏకం కావాల్సిందే
- 42% రిజర్వేషన్లకు ఎవడు అడ్డొచ్చినా తొక్కుకుంటూ పోవుడే
- భద్రాచలం బీసీల సమర శంకరావం సభలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్




# కవిత చుట్టూ రాజకీయాలు..!
# రాజకీయాల చుట్టూ కవిత...!!

## ఆమే కేంద్రంగా సాగుతున్న పాలిట్రిక్స్



- కేటీఆర్ కన్నా తనేం తక్కువ కాదని నిరూపించుకునే యత్నం..
- జాగృతి ద్వారా పొలిటికల్ మైలేజ్ కి కవిత విశ్వ ప్రయత్నాలు..
- అస్తిత్వ పోరాటంలో  భాగంగా పెట్టిన వేరు కుంపటి..
- కేసీఆర్, కేటీఆర్ లకు తలనొప్పిగా మారిన కవిత

**తండ్రితో విభేదించి, అన్న ఆధిపత్యాన్ని ధిక్కరించి వేరు కుంపటి పెట్టుకున్న కవిత ప్రస్తుతం తన రాజకీయ అస్థిత్వ పోరాటంలో బిజీ బిజీగా ఉన్నది. అన్నీ తలకెత్తుకుంటున్నది. అన్నింట్లో తలదూరుస్తున్నది.  అందరి కంటే తానే ముందుండే ప్రయత్నం చేస్తున్నది. సంబంధంలేని ఇష్యూలో కూడా తగుదునమ్మా అని తలదూర్చి వివాదాలు కొని తెచ్చుకుంటున్నది. బీసీ ఉద్యమం అలాంటిది. ఆమెను నమ్మింది లేదు ఎవరు. కానీ ఆమె ఆ లైన్ తీసుకుని తన దారిలో తాను కార్యక్రమాలు చేసుకుంటూ పోతున్నది.**

(దండుగుల శ్రీనివాస్)

రైల్ రోకోకు పిలుపునిచ్చినప్పుడు నవ్వుకున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేష్లపై ప్రకటన రాగానే అది తన వల్లేననడం మరింత హాస్యస్పదమైంది. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ నుంచి మొదలైన మాటల దాడి పరంపర కవితపై కొనసాగుతున్నది. అసలు బీసీలకు నీకేమిటీ సంబంధం అనడం స్టార్ట్ చేశారు. ఈ మాటలు జర ముందు నుంచీ అంటే బాగుండేదేమో. కానీ ఆ పోరాట ఫలితం నాదంటే నాదని, ఆ క్రెడిట్ మా పార్టీదని కాంగ్రెస్ వాదనలు, ప్రతివాదనలకు దిగుతున్నది.

### కేసీఆర్, కేటీఆర్‌లకు తలనొప్పి

అన్న మీద కోపమో, తండ్రి మీద అసహనమో.. ఇంకేదైనా ఫ్రస్టేషనో.. కానీ ఆమె రాజకీయంగా దూకుడుగా పోవడం బీఆరెస్ పార్టీకే నష్టం చేకూరుస్తున్నది. కేసీఆర్, కేటీఆర్‌లకు తలనొప్పిగా మారింది కవిత ఇష్యూ. బీసీల కాన్సెప్ట్ అయితే మరీ ఇరుకున పెట్టింది బీఆరెస్‌ను. అప్పుడు 23 శాతానికే బీసీల రిజర్వేషన్లు కుదించిన ఘనుడు కేసీఆర్. మొన్నటి వరకు పదేళ్ల పాటు పాలించి.. ఇప్పుడు అన్నీ టక్కున గుర్తొచ్చినట్టు కవిత అండ్ టీమ్, కేటీఆర్ అండ్ టీమ్ పెడుతున్న డిమాండ్లు వారికే తిరిగి కొడుతున్నాయి. బీఆరెస్ పార్టీ గొడుగుకిందే ఉండి పనిచేస్తున్నానని కవిత చెబుతున్నది. తండ్రి ఆశీస్సులతోనే ముందుకు సాగుతున్నానని కూడా నమ్మబలికిస్తున్నది. కానీ జాగృతి పేరుతో ఆమె మొత్తంగా వేరు కుంపటే పెట్టింది. ఆ గొడుగు కింద చేస్తున్న ప్రతీ కార్యక్రమం ఆమెకే కాదు.. ఎవరికీ మైలేజీ తీసుకురావడం లేదు. పైగా నష్టం చేస్తున్నది. అభాసుపాలవుతున్నది. తలనొప్పి వ్యవహారంలా మారుతున్నది. ఎవరిస్తున్నారో సలహాలు తెలియదు. ఆలోచన లేకుండా, ఆవేశంగా వేస్తున్న ప్రతి అడుగూ వివాదస్పదమవుతోంది.



సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు. సీఎంతో పాటు అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, తదితరులు. - వాస్తవం, హైదరాబాద్

# ఫ్రీ బస్సు.. సన్నబియ్యం... రేషన్‌కార్డులు..!
# జనం నాడీ పథకాలు..



## ప్రభుత్వానికి మైలేజీ తెచ్చే కాంగ్రెస్ మార్కు పథకాలివే..!
## మిగిలినవన్నీ కేసీఆర్ మార్కు పథకాలే..

**ఎన్నో హామీలిచ్చి గద్దెనెక్కిన సర్కార్‌కు అవి అమలు చేయడం అంత వీజీ కాదని తెలిసిపోయింది. బడ్జెట్ తలకిందులుగా ఉన్న విషయం అధికారంలోకి వస్తేగానీ తెలియదు. కొత్త పథకాలు, హామీల మాట దేవుడెరుగు.. పాతవి కొనసాగించడానికే తల్లడమల్లడమవుతోంది రేవంత్ సర్కార్. కానీ తక్కువ బడ్జెట్ సినిమాలు సూపర్ హిట్ అయినట్టు.. తక్కువ ఖర్చుతో సర్కార్ ప్రవేశపెట్టిన కొన్ని పథకాలు మంచి మైలేజీనే తీసుకొస్తున్నాయి. రైతు భరోసా, రైతు రుణమాఫీ కోసం వేల కోట్లు గుమ్మరించినా.. ఎక్కడో ఏదో వెలితి. ఇంకా ఏదో అసంతృప్తి. మాకు రాలేదనే అసహనం. దీంతో అందరికీ సంపూర్ణంగా మేలు చేయలేని దుస్థితి. అందరి మన్ననలు పొందలేని పరిస్థితి. రైతు కేంద్రంగా ఎంత రాజకీయం నడిపినా.. పాత సర్కారే కొంచెం బెటరనే ఫీలింగుకు ఇంకా చెరపలేకపోతున్నది రేవంత్ సర్కార్.**





(దండుగుల శ్రీనివాస్)

కొత్త పథకాల్లో ప్రధానంగా ఫ్రీ బస్సు. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీల్లో మొట్ట మొదటిగా అమలు చేసింది ఈ పథకాన్నే. ఇది స్టార్టింగ్‌లో ఇబ్బందుల పాలైంది. చాలీ చాలని బస్సులతో మహిళలకు నరకంగా మారింది. కానీ అలవాటు పడ్డారు. ఆధార్ కార్డు చెంత పెట్టుకుని ఎక్కడికైనా వెళ్లొచ్చనే ధీమా వారిలో పెరిగింది. పర్సులో నయా పైసా లేకపోయినా... ఒక్క ఆధార్ కార్డుంటే చాలు అని ఫిక్స్ అయిపోయారు. ఈ పథకాన్ని ఎవరున్నా అమలు చేయాల్సిందే. లేకపోతే అంత సంగతులు. అంతలా కనెక్టయ్యారు లేడీస్.

### వాళ్లు జాప్యం చేశారు.. వీళ్లు అమలు చేశారు..

ఇక మరీ తక్కువ బడ్జెట్‌తో అమలు చేసి జనాధారణ పొందిన ఇంకొక పథకం సన్నబియ్యం. అప్పుటి సర్కార్ కూడా ఆలోచన చేసింది. అమలులో జాప్యం చేసింది. దొడ్డు బియ్యం అమ్ముకుని సన్నబియ్యం కొనుక్కునే పరిస్థితి ఉంది. అంతా సన్నబియ్యానికి అలవాటు పడ్డారు. ఇదే జనం నాడిని పసిగట్టి సన్నబియ్యం పథకాన్ని అమలు చేస్తున్నది సర్కార్. ఇక ఇవాళ రేషన్ కార్డుల జారీ ప్రక్రియ. వాస్తవానికి రేషన్ కార్డులు ఇవ్వడమంటేనే సర్కార్‌కు భారం. అందుకే కేసీఆర్ సర్కార్ ఆనాడు దీని జోలికి పోలేదు. రేషన్ కార్డు ప్రమాణికంగానే ప్రభుత్వ పథకాలు అమలవుతాయి.

### భారమైనా.. రేషన్ కార్డులిస్తాం..

అందుకే ఇవి ఎన్ని ఎక్కువగా ఇస్తే  అంత భారమనే ఫీలింగు ప్రభుత్వాలకు ఉంది. కానీ కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు రెడీ అయ్యింది. వీటి కోసం చాలా రోజుల నుంచి చాలా మంది ఎదురుచూస్తున్నారు. పెద్ద పథకాలు సర్కార్ ఖజానాకు గండికొట్టి .. రావాల్సినంత మైలేజీని ఇవ్వకపోగా.. ఈ తక్కువ బడ్జెట్ సినిమాలు సూపర్ హిట్ ఖాతాల చేరుతున్నాయి. కీలెరిగి వాతలా.. జనం నాడెరిగి పథకాలన్నమాట.